Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143




ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 104 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | బుధవారం 15 ఏప్రిల్ 2026 | పేజీలు : 4 | వెల : 3



## బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

- బీజేపీ తొలి సీఎంగా రికార్డ్
- బిహార్‌లో బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎంపికైన సమ్రాట్ చౌధరీ
- నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- బుధవారం లోక్‌భవన్‌లో సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం.



## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు..

- 10 మంది మృతి.. 40 మందికి గాయాలు
- ప్రమాద స్థలంలో శిథిలాల కింద మరికొందరు కార్మికులు చిక్కుకుని ఉన్నట్లు అనుమానం
- ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్

### 45 లక్షల మందికి క్వాంటం..

# ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ

- దేశంలో తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఆవిష్కరణ
- 1 ఎస్,1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్‌లను జాతికి అంకితం చేసిన సీఎం చంద్రబాబు
- క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తాం
- ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేథాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఓ సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ఆవిష్కృతమైంది. అమరావతిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధా టవర్స్ వద్ద ఏర్పాటు చేసిన 1 ఎస్, 1 క్యూ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రారంభించిన అనంతరం క్వాంటం రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు - మిగతా3లో



# ఈ ఏడాది వర్షాలు తక్కువే!

- నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం
- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడుతాయని ఐఎండీ అంచనా
- సాధారణ సగటులో 92 శాతం వర్షపాతం నమోదుకావచ్చుని వెల్లడి
- ఎల్‌నినో వల్ల వర్షాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని అంచనా

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

దేశవ్యాప్తంగా ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షపాతం జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీర్ఘకాలిక వర్షపాత అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణ సగటులో 92 శాతంగా ఉండవచ్చని పేర్కొంది. దీనికి అదనంగా లోటుగా 5 శాతం మార్పు ఉండవచ్చని తెలిపింది. ఐఎండీ అంచనాల ప్రకారం వర్షపాత - మిగతా3లో

### రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్

## ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి

- కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోంది
- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది
- బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు మమతా ప్రభుత్వమే అవకాశం ఇచ్చింది
- రాహుల్ గాంధీ ఆరోపణలు





## 850కి లోక్‌సభ స్థానాలు

- డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు
- మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం
- దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- 2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో ప్రతిపాదించిన కేంద్రం
- ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం

### కుంభమేళా తరహాలో

# గోదావరి పుష్కరాలు



**దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**వివరాలు వెల్లడించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

2027లో వచ్చే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులతో గోదావరి పుష్కరాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ద్వారా జరుగుతున్న అభివద్ధి పనుల వివరాలను ఆరా తీసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. వివరాలను మంత్రి దుర్గేష్ వెల్లడించారు. మంగళగిరిలోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, - మిగతా3లో

# తారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు



- నేడు 42-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం
- రాష్ట్రంలో మరింత ప్రభావం చూపనున్న ఎండలు, వడగాడ్పులు
- నేడు కోస్తా, రాయలసీమలో 42-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం
- ఎండ తీవ్రత, ఉక్కపోతపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో వేసవి కాలం మొదలు కావడంతో రోజురోజుకీ ఎండలు, వడగాడ్పులు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు హడలిపోతున్నారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఎండ తీవ్రత మరింత ప్రభావం చూపనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. కడప జిల్లాలోని ఒంటిమిట్టలో ఈ రోజు - మిగతా3లో



## ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

- డెహ్రాడూన్ పర్యటనలో ప్రధాని మోదీ
- ఢిల్లీ, డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభం
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు
- ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలించింది
- హరిద్వార్‌లో జరగనున్న కుంభమేళా సందర్భంగా ఉత్తరాఖండ్‌ను శుభ్రంగా ఉంచాలని పిలుపు

### నారీ శక్తి వందన్ బిల్లుకు అందరూ

# మద్దతివ్వాలి

- రాజకీయ పార్టీల సీఎం లేఖ
- నారీ శక్తి వందన్ అధినియం మహిళా సాధికారతకు, దేశ ఉన్నతికి దోహదపడుతుందన్న చంద్రబాబు
- ప్రభుత్వం, పరిపాలన, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి
- మహిళా రిజర్వేషన్లపై అంతా ఒకే స్వరం వినిపించాలి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

మహిళా శక్తికి చట్టబద్ధ గౌరవం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తన వంతు చొరవ తీసుకున్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లుకు దేశవ్యాప్తంగా ఏకగ్రీవ మద్దతు కూడగట్టాలని రాష్ట్రంలోని అన్ని పార్టీలకు లేఖలు రాశారు. ప్రభుత్వం, పరిపాలన, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమన్నారు. చారిత్రాత్మక ఘట్టంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల నుంచే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న 'నారీ శక్తి వందన్' చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలకాలని లేఖలో కోరారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు నారీ శక్తి వందన్ అధినియంకు పార్లమెంట్‌లో మద్దతివ్వాలని రాజకీయ పార్టీల అధ్యక్షులు, రాష్ట్రంలోని రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఏపీసీసీ - మిగతా3లో

### కుప్పం డి.ఎస్.పి కార్యాలయంలో
# అంబేద్కర్ జయంతి వేడుకలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 14:** రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కుప్పం డి.ఎస్.పి కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి పార్థసారధి, కార్యాలయ సిబ్బంది పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ.. అంబేద్కర్ దేశానికి చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. సమాజంలో సమానత్వం, న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర దేశానికి మార్గ దర్శకంగా నిలిచిందని వివరించారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్
### పార్టీ అధ్యక్షులు తాళ్లూరి శివ నాయుడు



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 14:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి శివనాయుడు అన్నారు మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జన్మదినం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాలసముద్రం మండల అధ్యక్షుడు తాళ్లూరి శివనాయుడు మాట్లా డుతూ అంటరానితనం నిర్మూలన వివక్షపై అలుపెరగని పోరాటం చేశారు భారత రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్ కి దక్కుతుందని తెలియజేశారు. అంబేద్కర్ సేవలను కొనియాడారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు స్కౌట్స్ విద్యార్థుల నివాళి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** శ్రీకాళహస్తి భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు స్థానిక భాస్కర్‌పేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్టీసీ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్కౌట్ మాస్టర్లు అజారుద్దీన్, వెంకటేష్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ జీవిత విశేషాలను వివరించారు. ఆయన రచించిన భారత రాజ్యాంగం బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ జ్యోతి, స్కౌట్స్ , గైడ్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### పెరుమాళ్లపల్లి పంచాయతీలో
## అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామసభ



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లి పంచాయతీ భవనంలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి అధికారి ధనుంజయ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి గ్రామ ప్రజాప్రతిని ధులు, గ్రామస్థులు హాజరయ్యారు. సభలో తాగునీటి సమస్యలు, భూస్వామ్య హక్కుల సర్వే, ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమంపై చర్చించి వివరించారు. గ్రామాల్లో పరిశుభ్రతను మెరుగు పరచడం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం పై అధికారులు దృష్టి సారించారు. అనంతరం గ్రామ ప్రజల నుండి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటామని తెలిపారు.

## వెదురుకుప్పం మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**



రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వెదురుకుప్పం మండలం చవటగుంట కూడలిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కె.ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షుడు బి.అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మాట్లాడుతూ... సమాజంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి విద్యే ప్రధాన సాధనమని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాం గాన్ని రూపొందించిన గొప్ప మేధావి అంబేద్కర్ అని వివరించారు. ఈ కార్య క్రమంలో ప్రధానకార్యదర్శి గోపి, ఉపాధ్య క్షులు శంకర్ రెడ్డి,మోహన్ రెడ్డి, మాధవ రెడ్డి, మండల కార్యదర్శులు సుబ్రమణ్యం రెడ్డి, నాగేశ్వరి పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర మండలి సభ్యుడు చెంగా రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లికా, జిల్లా మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి గిరిజా రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి విజయ్ భాస్కర్ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శేఖర్, జిల్లా సామాజిక మాధ్యమ సభ్యుడు గుణశేఖర్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరసింహ రెడ్డి, సీనియర్ నాయకులు హను మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.

### పి.ఇ.ఎస్ వైద్య విద్యాసంస్థలో
# వృత్తి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ప్రారంభం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** కుప్పంలోని పి.ఇ.ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ లో 2025--26 విద్యా సంవత్సరానికి చెందిన ప్రథమ సంవత్సరం పీజీ నివాస వైద్యులు, ఉపాధ్యాయుల కోసం రూపొందించిన వృత్తి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం తొమ్మిది గంటల ముప్పై నిమిషాలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విభాగాధిపతులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూపా సురేష్, హెచ్.ఆర్. కృష్ణరావు, సుబ్రహ్మణ్య, కిరణ్ కృష్ణమూర్తి, రష్మి శర్మ హాజరయ్యారు. కార్యక్రమంలో వైద్య రంగంలో అవసరమై న వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రూపా సురేష్ ప్రస్తుత వైద్య రంగంలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు సంభాషణ నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పీజీ విద్యార్థులు సమగ్ర వైద్యులుగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. హెచ్.ఆర్. కృష్ణరావు మాట్లాడుతూ... వైద్యవిద్య కేవలం పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ






వికాసం, నైతిక విలువలను కూడా కలిగి ఉండాలని అన్నారు. ఈ దిశగా సంస్థ ముందంజలో ఉందని వివరించారు. సుబ్రహ్మణ్య మాట్లాడుతూ, రోగి సేవల్లో నాణ్యత పెంచేందుకు సమూహంగా పనిచేయడం, సమర్థవంతమైన సంభాషణ కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువ వైద్యులు వృత్తిపరమైన ప్రవర్తనలో మరింత నైపుణ్యం పొందుతారని అన్నారు. రష్మి శర్మ మాట్లాడుతూ..వృత్తి ప్రావీణ్యం నిరంతర అభ్యాసం,ఆత్మ పరిశీలన ద్వారా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంవిద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ఆరు నెలలపాటు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సంభాషణ నైపుణ్యాలు, సమూహ సహకారం, నాయకత్వ లక్షణాలు, భావోద్వేగ మేధస్సు వంటి అంశాలలో అభివృద్ధి కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వైద్య విద్యలో నూతన ప్రమాణాలను నెలకొల్పుతూ భవిష్యత్ వైద్యులను సమగ్రంగా తీర్చిదిద్దడంలో ఈ కార్య క్రమం కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ యాజమాన్యం పేర్కొంది.

## ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135 వ జయంతి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్ , ఏప్రిల్ 14:** అన్నమయ్యజిల్లా పీలేరు పట్టణంలో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా నాయకుడు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు హాజరై బాస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని,ఆయన రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాలకు అన్ని సదుపాయాలు కల్పించకపోతే వారు ఇప్పటికీ దారిద్ర్యంలో మగ్గిపోతు ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి కృష్ణయ్య,వంగిమల్ల గురునాథ, పల్లెపోగు హరినాథ, ముల్లంగి గురవయ్య, యర్రబల్లి జనార్ధన్, ఆంజనేయులు వర్ల చంద్రయ్య, సి. హరిబాబు, కుమార్ రాజా, రెడ్డి చందు తదితరులు పాల్గొన్నారు.

## రాళ్ల బూదుగురు పోలీస్ స్టేషన్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 14:**



రాజ్యాంగ శిల్పి డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాళ్ల బూదుగురు పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ ఐ.నరేష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం అంబేద్కర్ చేసిన సేవలు దేశానికి చిరస్మరణీ యమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు

**పెనుమూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14 :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు,క్లస్టర్ ఇన్‌చార్జ్ తలారిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ సేవలను స్మరిం చుకుంటూ నాయకులు ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాణంలో ఆయన చేసిన కృషి, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం గురించి వివరించారు. ఈ



కార్యక్రమంలో అంబేద్కర్ అబి.మానులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు
### అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే అమర్



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** భారతరాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు పలమనేరులో మంగళవారం ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ విభాగ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, నేటి యువత ఆయనలాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజు, నాయకులు కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, చిన్ని, ఖాజా,బిఆర్సి కుమార్, పర్వీన్,పలమనేరు మండల నాయకులు నాగరాజురెడ్డి, వెంకటమునిరెడ్డి, గంగవరం నాయకులు సోమశేఖర్ గౌడ్, పల్లె రుచులు అమరనాథ రెడ్డి, రవి,గిరిధర్ గోపాల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకల్లో .డా.చంద్రప్ప

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** శ్రీకాళహస్తి భారతీయ జనతాపార్టీ శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్ నగర్ 109వ పోలింగ్ బూత్ లో డా.చంద్రప్ప ఆధ్వర్యంలో డా.బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు కండ్రిగ ఉమా పోలింగ్ బూత్ సభ్యులతో కలిసి డా. బి.ఆర్.అంబేద్కర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వార్డులోని పిల్లలు,పెద్దలందరికీ స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఘనంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు
### ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం




**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాసిల్దార్ లోకనాథం పెళ్లై, ఎస్ఐ సుమన్ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తిరుమల పాల్గొన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనగారిన వర్గాల్లో చైతన్య నింపి అంటరానితనం పై జీవిత పోరాటం చేసిన యోధుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా విద్యా సమాన అవకాశాలను పౌరులందరికీ కల్పిస్తూ ఎస్సీ, ఎస్టీలకు కోసం ప్రత్యేక వాటి రక్షణ కోసం రిజర్వేషన్ చట్టాలు తీసుకొచ్చిన దళిత బాంధవుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఆయన స్ఫూర్తితో అందరు ముందుకు నడవాలని అన్నారు. అనంతరం 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పురం పీఏసీ చైర్మన్ నిరంజన్ రెడ్డి నియోజకవర్గ, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు జలంధర్ నాయుడు జనసేన పార్టీ ఉపాధ్యక్షులు కాంజేరి చందు, జిల్లా ఆర్టిఐ అధ్యక్షులు జయరాజ్,నోమేష్ రెడ్డి, గజేంద్ర, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తిరుమల ఆంధ్రజ్యోతి నియోజకవర్గ ఇన్చార్జ్ రవి, ట్రెజరర్ నరేష్, ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్‌లు సతీష్, మహేంద్ర, దేవరాజులు ,ప్రేమ్ చందు మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వార్షికోత్సవ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** శ్రీకాళహస్తి శ్రీకాళహస్తిలోని అగ్నిమాపక కేంద్రంలో స్టేషన్ ఫైర్ అధికారి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక వార్షికోత్సవ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ఉపయోగించే యాంత్రిక పరికరాలను పరిశీలించారు. ఈ పరికరాలు ఏవిధంగా ఉపయోగిస్తారు స్టేషన్ మాస్టర్ ఆర్డీవో వివరించారు. ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి అగ్నిమాపక అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు. ఈ వారోత్సవాలు వారం రోజుల పాటు ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించినట్లు వివరించారు.సురక్షిత పాఠశాలలు,సురక్షిత ఆసుపత్రులు,అగ్ని భద్రతపై స్పృహ ఉన్నసమాజం మంటల నివారణకు కలిసి పనిచేస్తాయి అనే నినాదంతో ఈ కార్యక్రమాలు సాగుతాయని ఆయన పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు,పెట్రోల్ బంకులు,రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలి. గ్యాస్ లీకేజీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక యంత్రాలను ఎలా ఉపయోగించాలో ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తామని ముఖ్యంగా వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువని ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఏదైనా ప్రమాదం సంభవించిన ప్పుడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరులో అంబేద్కర్ జయంతి వేడుకలు



**సూళ్లూరుపేట, చిత్తూర్ ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:** సూళ్లూరుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సూళ్లూరుపేట పట్టణం లోని సూళ్లూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ సేవా సమితి వ్యవస్థాపకులు చిన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం అక్కడే కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ సమానత్వం సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.


# తారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు

-మొదటిపేజీ తరువాయి

45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని, 262 మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. రేపు రాయలసీమ, కోస్తా జిల్లాల్లో 42-44 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 46 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 4 మండలాలు, విజయనగరం జిల్లాలో 19, పార్వతీపురం మన్యం జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1, పోలవరం జిల్లాలో 4, అనకాపల్లి జిల్లాలో 2, కాకినాడ జిల్లాలో 1, తూర్పుగోదావరి జిల్లాలో 1 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 73 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి


వడగాడ్పుల తరుణంలో ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలని అధికారులు చెప్తున్నారు. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని, చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని అదే విధంగా నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.



నగరాల్లో పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి వస్త్రాలు రక్షణగా ధరిస్తున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బళ్ల వద్దకు చేరుతున్నారు. భూతాపంతో ఎండలు ఎక్కువగా ఉండే విజయవాడ వంటి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నగర వాసుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వడదెబ్బ వల్ల నమోదైన కేసులు: ఎండలు, వడగాడ్పుల వల్ల వడదెబ్బలు తగిలే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో 2023లో 833, 2024లో 4,444, 2025లో 5,154 చొప్పున వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. 2025లో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 1,284, కృష్ణా జిల్లాలో 1,214, విశాఖలో 1,089, కడపలో 325, పల్నాడు జిల్లాలో 268 చొప్పున వడదెబ్బ కేసుల నమోదయ్యాయి.

# మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం
# కేబినెట్ మార్పు చేర్పుల సమీకరణాలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులపై ప్రదర్శిస్తున్న అసహనం కేవలం పరిపాలనాపరమైన కోపమే కాకుండా, రాబోయే భారీ రాజకీయ మార్పులకు సంకేతంగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవలి కేబినెట్ సమావేశంలో కేబినెట్ అజెండా మీడియాకు లీక్ అవ్వడంపై ఆయన స్పందించిన తీరు, మంత్రుల పనితీరుపై ఆయన ఇస్తున్న రేటింగ్స్.. త్వరలోనే ఏపీ మంత్రివర్గంలో మార్పుచేర్పులు ఉండబోతున్నాయనే అంచనాలను బలపరుస్తున్నాయి సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో, అజెండాలోని కీలక అంశాలు అధికారికంగా వెల్లడించక ముందే మీడియాలో రావడంపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన దివంగత ఎన్టీఆర్ హయాంలో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేశారు. బడ్జెట్ వివరాలు లీక్ అయినందుకు ఎన్టీఆర్ మొత్తం మంత్రివర్గాన్నే రద్దు చేసిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. గోప్యత పాటించలేని మంత్రులు ఉంటే ఎంత, లేకపోతే ఎంత అని నిలదీశారు. ఇది మంత్రులకు ఇచ్చిన ఆఖరి హెచ్చరికగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తోంది . సాధారణంగా చంద్రబాబు తన గత అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వం సగం కాలం పూర్తి చేసుకునే సమయానికి మంత్రుల పనితీరుపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేస్తారు. ప్రస్తుతం మంత్రుల గ్రాఫ్, ప్రజల్లో వారి ఇమేజ్, శాఖలపై పట్టు వంటి అంశాలను ఆయన నిశితంగా గమనిస్తున్నారు. ఎవరైతే ఆశించిన స్థాయిలో పని చేయడం లేదో, వారిని తప్పించి కొత్త రక్తానికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నాలుగు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావిస్తున్న బాబు, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు సమర్థులైన నేతలకు మంత్రి పదవులు ఇవ్వాలని భావిస్తున్నారు. కేబినెట్ అజెండాను కూడా ముందస్తుగా చదువుకోకుండా వస్తున్న మంత్రులపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రజల్లో మంచి మైలేజ్ ఉన్న నేతలతో కూడిన కొత్త టీమ్ ను రంగంలోకి దించే అవకాశం ఉంది. అజెండా కాపీలు ఎవరు లీక్ చేస్తున్నారో, ఏ మంత్రులు మీడియా ప్రతినిధులతో అతిగా సాన్నిహిత్యం నెరుపుతున్నారో తనకు తెలుసని చంద్రబాబు సంకేతాలిచ్చారు. ఇది మంత్రులలో ఒక రకమైన భయాన్ని కల్పించింది. కేవలం లీకులే కాకుండా, శాఖా పరమైన నిర్ణయాల్లో జాప్యం, కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యం వంటివి కూడా బాబు అసహనానికి కారణమయ్యాయి. ఈసారి మంత్రివర్గ మార్పుల్లో నారా లోకేష్ మార్క్, అలాగే కూటమి ధర్మం ప్రకారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు కూడా కీలకం కానున్నాయి. యువ నేతలకు ప్రాధాన్యత పెంచడం, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడం ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వంటి అంశాల ఆధారంగా కొత్త మంత్రుల ఎంపిక ఉండవచ్చు. పనితీరు బాలేని సీనియర్లను పార్టీ బాధ్యతలకు పరిమితం చేసి, చురుకైన వారిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం మెండుగా ఉంది. చంద్రబాబు సీరియస్ లుక్ వెనుక ఒక పెద్ద క్లీనింగ్ ప్రాసెస్ దాగి ఉందని అర్థమవుతోంది. పరిపాలనలో క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారినైనా తప్పిస్తాననే సందేశాన్ని ఆయన బలంగా పంపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే లేదా రెండేళ్ల పాలన ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్‌లో భారీ మార్పులు జరగడం దాదాపు ఖాయమని చెప్పవచ్చు.



## అగ్నిమాపక వార్షికోత్సవ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తిలోని అగ్నిమాపక కేంద్రంలో స్టేషన్ ఫైర్ అధికారి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక వార్షికోత్సవ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ఉపయోగించే యాంత్రిక పరికరాలను పరిశీలించారు. ఈ పరికరాలు ఏవిధంగా ఉపయోగిస్తారు స్టేషన్ మాస్టర్ ఆర్డీవో వివరించారు. ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి అగ్నిమాపక అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు. ఈ వారోత్సవాలు వారం రోజుల పాటు ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించినట్లు వివరించారు. సురక్షిత పాఠశాలలు, సురక్షిత ఆసుపత్రులు, అగ్ని భద్రతపై స్పృహ ఉన్నసమాజం మంటల నివారణకు కలిసి పనిచేస్తాయి అనే నినాదంతో ఈ కార్యక్రమాలు సాగుతాయని ఆయన పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, పెట్రోల్ బంకులు, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలి. గ్యాస్ లీకేజీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక యంత్రాలను ఎలా ఉపయోగించాలో ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తామని ముఖ్యంగా వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువని ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే అగ్నిమాపక కేంద్రానికి సమాచా రం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా
## రామకుప్పం గురుకుల పాఠశాల దత్తత



**రామకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 14:**
రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి నూతన దిశ ప్రారంభమైంది. ప్రముఖ పారిశ్రామిక సంస్థ మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఈ పాఠశాలను దత్తత తీసుకుని అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సంస్థ ప్రతినిధి ఎం.జి.వి.కే.భాను, చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమల్ల ప్రసాదరావు, కాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సురేష్ బాబు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎం.జి.వి.కే. భాను మాట్లాడుతూ సంస్థ లక్ష్యం కేవలం సామాజిక బాధ్యత నిధులతో భవనాలు నిర్మించడం కాదని, విద్యార్థుల్లో ప్రవర్తనా మార్పు తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వారి ఆలోచనా విధానాన్ని మార్చి క్రమశిక్షణతో కూడిన విద్య అందించడం ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులను సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా మానసికంగా సిద్ధం చేయడంపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అంబేద్కర్ జయంతి రోజునే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నారీ శక్తి వందన్ బిల్లుకు అందరూ మద్దతివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రి లేఖలు రాశారు.

### 'నారీ శక్తి వందన్ అధినియం'

మహిళలకు పార్లమెంట్, విధాన సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాని మోదీ సంకల్పాన్ని బలపరుద్దామని సీఎం విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు ప్రవేశపెట్టే ఈ నెల 16వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టమని లేఖలో పేర్కొన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం' మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలుకుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

### 'మహిళా రిజర్వేషన్లపై అంతా ఒకే స్వరం వినిపించాలి'

ఎక్కడ మహిళలను గౌరవిస్తారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని భారతీయ ధర్మం చెబుతోందన్న సీఎం దీనికి నిదర్శనమే 'నారీ శక్తి వందన్ అధినియం' అన్నారు. చట్టసభల్లో ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు 2029 నుంచే అమల్లోకి వచ్చేలా చట్ట సవరణకు కేంద్రం సంకల్పించిందని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై అంతా ఒకే స్వరం వినిపించాలని ఆడబిడ్డల తరపున బాధ్యతతో లేఖ రాస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, పార్లమెంట్ సభ్యులు ఏకగ్రీవంగా బిల్లుకు మద్దతు పలకాల్సిన అవసరం ఉందన్నారు. మన ఇంటి ఆడబిడ్డలను, మన దేశ మహిళలను గౌరవించుకునే ఈ అవకాశాన్ని మనందరం అదృష్టంగా భావిద్దామన్నారు. ఈ పవిత్ర ఘట్టంలో భాగస్వామ్యమయ్యే సందర్భాన్ని ఎవరూ వదులుకోవద్దని పిలుపునిచ్చారు.

చారిత్రాత్మక నిర్ణయం: భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలికే గొప్ప క్షణాలకు 140 కోట్ల మంది భారతీయులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ చట్టం రాజకీయాలకు అతీతం ఇది దేశ గౌరవానికి చెందిన విషయమని తెలిపారు. ప్రతీ పార్టీ, ప్రతీ ఎంపీ ఈ చారిత్రాత్మక నిర్ణయంలో తమ ముద్ర వేయాలని ఆకాంక్షించారు.

## ఈ ఏడాది వర్షాలు తక్కువే!

-మొదటిపేజీ తరువాయి

అంచనా 1971-2020 మధ్య కాలంలో దేశ సగటు వర్షపాతం 87 సెం.మీ.గా ఉంది. ఈ ఏడాది వర్షపాతం ఇందులో 90 నుంచి 95 శాతం మధ్య (సాధారణం కంటే తక్కువ) నమోదయ్యే అవకాశం ఎక్కువగా ఉందని ×వీణ అంచనా వేసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో బలహీన ఎల్?నినో పరిస్థితులు తటస్థ స్థితికి మారుతున్నాయని అయితే రుతుపవన కాలంలో ఎల్?నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది సాధారణంగా వర్షాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. హిందూ మహాసముద్రంలో ప్రస్తుతం తటస్థ పరిస్థితులు ఉన్నప్పటికీ, సీజన్ ముగిసే సమయానికి 'పాజిటివ్ ఐఓడీ' ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ మోడల్స్ సూచిస్తున్నాయి.

దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ఈశాన్య, వాయువ్య ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల గమనానికి సంబంధించి మరిన్ని ఖచ్చితమైన వివరాలతో కూడిన రెండో విడత అంచనాలను మే చివరి వారంలో విడుదల చేస్తామని వాతావరణ శాఖ తెలిపింది. అప్పుడు ప్రాంతాల వారీగా వర్షపాత వివరాలను వెల్లడించనున్నారు. తారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు: ఇదిలా ఉండగా రాష్ట్రంలో రోజురోజుకీ ఎండలు, వడగాడ్పులు తారెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడతున్నారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వడగాడ్పుల తరుణంలో ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలని అధికారులు చెప్తున్నారు. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని, చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని అంటున్నారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

## 45 లక్షల మందికి క్వాంటం.. ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ



-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ..'ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మొట్టమొదటి క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని ప్రారంభించటం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలీటీ, మేధాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను. క్వాంటం సైన్స్ వంద ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున దీన్ని సాకారం చేసుకుని చరిత్ర సష్టించాం. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకుని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించుకున్నాం. క్వాంటం టెక్నాలజీని పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా ఈ టెస్ట్ బెడ్‌లను ఏర్పాటు చేయటంపై అందరికీ అభినందనలు. భారత తొలి ఓపెన్--యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలతో పాటు అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఏక్యూవీ ని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్‌కు ధన్యవాదాలు. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్ ,1 క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టిఫై చేయడానికి కీలకం. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు గర్విస్తున్నాను. ఐటీ రంగంలో కీలక పాత్ర పోషించిన తెలుగు గడ్డ ఇప్పుడు క్వాంటం టెక్నాలజీకి వేదికగా మారటం సంతోషదాయకం" అని ముఖ్యమంత్రి అన్నారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అదేవిధంగా నిడదవోలు నియోజకవర్గంలో గ్రామీణ అభివద్ధి, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పలు పనులు చేపట్టినట్లు, వాటి పురోగతిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు వివరించినట్లు మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ క్రమంలో నిడదవోలు అభివద్ధికి సహకరిస్తున్నందుకు డిప్యూటీ సీఎం కి మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్..



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 14:**
గత సాయంత్రం వీకోటలోని మార్కెట్ యార్డ్ నుండి వైయస్సార్ సర్కిల్ కు ఆటలో పత్రపల్లి గ్రామానికి చెందిన యాస్మి అను మహిళ ఆటో ఎక్కి వైఎస్ఆర్ సర్కిల్‌లో హడావుడిగా ఆటో దిగే క్రమంలో తమ సెల్ ఫోన్ మొబైల్‌ను ఆటోలనే వదిలి వెళ్ళిపోయింది, కొంత సమయానికి ఉన్న సెల్లును చూసిన ఆట డ్రైవర్ గోవింద్ నగర్‌కు చెందిన కే చంద్రశేఖర్ నిజాయితీగా ఆ సెల్ ఫోన్ వి .కోట పోలీస్ స్టేషన్ సిఐ కు అందజేసి, తమ నిజాయితీని సాటుకున్నాడు, విచారణలో మొబైల్ వ్యక్తి అయిన యాస్మికు అప్పగించడంతో వి కోట సీఐ సోమశేఖర్ రెడ్డి ఆటో డ్రైవర్ నిజాయితీను గుర్తించి దృశ్యాలతో సత్కరించి శుభాభినందన తెలియజేసినారు. సి ఐ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏదేని వస్తువులు ప్రజలకు దొరికిన నిజాయితీగా పోలీస్ స్టేషన్లో అప్పగించి ప్రజలకు సహకరించాలని తెలియజేశారు.

## వి.కోటలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**



రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు వి.కోట మండలంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల దళిత సంయుక్త చర్యా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. జయంతిని పురస్కరించుకుని ట్రాక్టర్‌పై అంబేద్కర్ భారీ కటౌట్ ఏర్పాటు చేసి వైఎస్ఆర్ సర్కిల్ నుంచి పట్టణ ప్రధాన బజారు మార్గం మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు డప్పుల సందడి మధ్య భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలు, అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తదుపరి దళిత సంయుక్త చర్యా సమితి నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది అంబేద్కర్ విగ్రహా నికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుంచి దుర్గా నగర్‌లోని దుర్గామాత ఆలయ కళ్యాణ మండపం వరకు ఊరేగింపుగా వెళ్లి జయంతి శుభాకాంక్షల సభ నిర్వహించారు. సభలో అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని, సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల దళిత నాయకులు సంఘం వెంకటస్వామి, శివుని కుప్పం రామకృష్ణ, శివరాం, మాజీసర్పంచ్ వెంకటప్ప, అఖిల్,జాకీర్, సేవాప్రతినిధులు డాక్టర్ స్వామికన్నన్, జయప్ప, ఆనంద్ పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహణ

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 14:**
రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలోకి వచ్చిన నేపథ్యంలో వి.కోట గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామాల్లో ఎదురవుతున్న తాగు నీరు, పారిశుద్ధ్యం, రహదారులు, కాలువల వంటి చిన్నచిన్న సమస్యలను ప్రజలు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రత్యేక అధికారి సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నిర్వాహక మండలి సభ్యుడు రంగనాథ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామంలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. వీధులు, కాలువలను శుభ్రంగా ఉంచడంలో ప్రజలు, కార్మికులు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా భద్రపరిచి పంచాయతీ చెత్త వాహనాలకు అందజేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త కోసం వేర్వేరు బుట్టలు అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి పలమనేరు మార్కెట్ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు నారాయణస్వామి, ధీరజ్, శబరి,మురుగేష్, మాజీసర్పంచులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మట్టి అక్రమాలపై ఎమ్మెల్యే ఆగ్రహం చర్యలకు ఆదేశాలు

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**



పలమనేరు పట్టణంలో పెరుగుతున్న మట్టి అక్రమాలపై ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలోని గంటావూరు చెరువులో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై స్థానికులు వినతి పత్రం అందజేయడంతో వెంటనే స్పందించారు. చెరువులో భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరపడంతో పాటు పక్కనున్న స్మశానంలో కూడా తవ్వకాలు నిర్వహిస్తున్నారని, దీంతో స్మశాన స్థలం కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికులు తెలిపారు. ఇటీవల జరిగిన తవ్వకాలలో శవాలు బయటపడిన ఘటనలు చోటు చేసుకు న్నాయని ఆవేదనవ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే నీటిపారుదల శాఖ,పోలీసు అధి కారులతో మాట్లాడి తక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ సీఐ మోహన్ రెడ్డిని కార్యాలయానికి పిలిపించి మట్టి అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని, ఎవరినీ ఉపేక్షించవద్దని స్పష్టంచేశారు. అదేవిధంగా చెరువును అధికారులు పరిశీలించి నీటి ప్రవాహ మార్గాన్ని గుర్తించాలని, చెరువు ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. గ్రామస్తు లు కూడా అప్ర మత్తంగా ఉండి అక్రమాలను అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించడం పై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట పురపాలక సంఘం కార్యాలయంలో**

## జనగణ-2027 శిక్షణ విజయవంతం

**సూళ్లూరుపేట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**



సూళ్లూరుపేట పురపాలకసంఘం కార్యాలయంలో జనగణ 2027 అంశంపై నిర్వహించిన శిక్షణకార్యక్ర మం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం ద్వారా ఎన్యుమారేటర్స్, సూపర్వైజర్స్‌కి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, విధానాలు, కార్యచరణ పైసమగ్ర అవగాహన కల్పించబడింది. చార్జ్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య ప్రజలను se.census.gov.in ద్వారా సెల్ఫ్ ఎన్రోల్మెంట్ చేసుకోవాలని సూచించారు. శిక్షణలో గృహాల వారీగా వివరాల సేకరణ మొబైల్/ డిజిటల్ అప్లికేషన్ వినియోగం జనగణన మార్గ దర్శకాలు డేటా ఎంట్రీ ప్రక్రియలకు సంబంధించిన అంశాలను చర్చించారు. ఈ అంశాలు ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలకమని జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాది అని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు స శాఖ అధికారులు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**
పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలంలో ఇటీవల జరిగిన పాత్రికేయ సమావేశంలో మాజీ శాసనసభ్యులు చేసిన వ్యాఖ్యలపై మండల ప్రజాప్రతినిధులు స్పందించారు. మండల ఎంపీపీ కే.యూరాజు మాట్లాడుతూ... వ్యక్తిగత విమర్శలు మానుకొని మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. గత పాలనలో అభివృద్ధి జరగలేదన్న వ్యాఖ్యలను ఖండిస్తూ, గ్రామాలలో నిర్మించిన సిమెంట్ రహదారులు, పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ వైద్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, నివాస కాలనీలు వంటి అనేక పనులు అమలయ్యాయని వివరించారు. ప్రతి గ్రామం, ప్రతి పంచాయ తీలో అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నా రు. మాజీ



శాసనసభ్యుడు వెంకటే గౌడపై చేసిన వ్యాఖ్యలు తగవని అభిప్రాయపడ్డారు. ప్రజా మద్దతుతో గత ఎన్నికల్లో అధిక ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. రాజకీయ అనుభవం తక్కువ ఉన్నప్పటికీ ప్రజల విశ్వాసంతో గెలిచిన విషయం విస్మరించరాదని తెలిపారు. మండలంలో నిర్మాణం ప్రారంభమైన శీతల గిడ్డంగి, క్రీడా సముదాయం, బీసీ భవన్, మైనారిటీ భవన్, అంబేద్కర్ భవన్ వంటి నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని సూచించారు. మండల అభివృద్ధి కోసం గతంలోనే నిధుల ద్వారా సహకారం అందించిన విషయాన్ని గుర్తు చేస్తూ, పరస్పర విమర్శలు మానుకొని ప్రజా సమస్యల పరిష్కా రంపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతిని ధులు, నాయకులు పాల్గొన్నారు.

# అమ్మ అనాధ మహిళ వృద్ధాశ్రమం రజతోత్సవ సౌరభం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం అమ్మ అనాధ మహిళా వృద్ధాశ్రమం శివనాథపురం 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రషతోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగినది. సుఖ బ్రహ్మాశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీవిద్యా స్వరూపానందగిరి స్వాములవారు అమ్మ విగ్రహానికి పూజనిర్వహణతో కార్యక్రమం ప్రారంభమైనది. ఈ కార్యక్రమం అమ్మ ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు పి.భూలక్ష్మి అధ్యక్షతన మాజీమంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి చిత్రపటానికి పూజతో నివాళులర్పిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సరోజమ్మ, సరస్వతమ్మల పర్యవేక్షణలో ఈ రజతోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి, బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు. ఈ పాతికేళ్ల సేవా ప్రస్థానంలో ఎదుర్కొన్న ఒడిదుడుకుల గురించి ఎలా లక్ష్యం సాధించారో పి.భూలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ...మంగళవారం తొట్టంబేడు మండలంలోని శివనాదపాలెం గ్రామంలో ఉన్న “అమ్మ అనాధ వృద్ధ మహిళల ఆశ్రమం” స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వసంతోత్సవ వేడుకల



కు బొజ్జల బృందమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె ఆశ్రమం నిర్వహణను అభినందిస్తూ, ఇలాంటి సేవాకార్యక్ర మాలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. తోడులేని వృద్ధులకు ఈ ఆశ్రమం ఒక నిలువెత్తు నీడగా నిలుస్తూ,వారికి ఉచిత భోజనం, సంరక్షణ అందించడం గొప్పవిషయం అని కొనియాడారు. ఆశ్రమంలోని వృద్ధులను స్వయంగా పలకరించి వారి యోగ క్షేమాలను తెలుసుకున్న బృందమ్మ ఇలాంటి సేవాదృక్పథంతో ముందుకు సాగుతున్న నిర్వాహకులకు తన అభినందనలు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు తోడ్పడాలని ఆమె ఆకాంక్షించారు. అనాధ మహిళవృద్ధులకు చేసిన సేవను కొనియాడుతూ.. ఆశ్ర మానికి మూల స్తంభాలైన అక్కాచెల్లెళ్ళ సరోజమ్మ, సరస్వతమ్మ, భూలక్ష్మిలను ప్రశంసించారు. చిన్నారి రూపచందన నృత్య ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను దుస్సాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, బిజెపి నాయకురాలు కండ్రిగ ఉమ, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మ్యాగీక్లారా, మాజీ పాలకమండలి సభ్యురాలు బి.రేణుకాదేవి,మాజీ పాలక మండలి సభ్యురాలు ప్రమీలమ్మ ,గౌరవ సలహాదా రు జయంతి జయకర్,చెన్నై,ప్రముఖ చిత్రకారులు కె.దామోదరాచారి చంద్ర బాబు,న్యాయవాది రాజేశ్వరరావు, యోగ మాస్టర్ కిరణ్ కుమార్,అమ్మ ఆశ్రమం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 14:**
భారతదేశమే కాకుండా ప్రపంచదేశాల్లో మరువరాని ముద్ర వేసుకున్న చిరస్మర ణీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్కరేనని ఆల్ ఇండియా బహుజన సమాజ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి.మునిరత్నం, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర నాయకురాలు సరస్వతి, జిల్లా కార్యదర్శి చిలకమ్మ, జిల్లా గౌరవ అధ్యక్షులు మణి, మహిళా నాయకురాలు సరస్వతి, యువజన సంఘం నాయకులు సోమశేఖర్, డప్పు కళాకారుల సంఘం నాయకులు గుర్రం సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అందులో భాగంగా మంగళవారం పలమనేర్ పట్టణంలో గల మానవ హక్కుల కార్యాలయంలో మున్సిపల్ కార్మిక నాయకులు రమేష్ అధ్యక్షతన రాజ్యాంగ నిర్మా త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బాబా సాబ్ అంబేద్కర్ ఎన్నో అవమానాలకు గురై మన దేశంలోనే కాకుండా వివిధ దేశాల్లో తనకంటూ చెర పరాని ముద్ర వేసుకున్న మహా మేధావి అని కొనియాడారు. వివిధ దేశాల్లో చదువుకుంటూ అక్కడ పరిస్థితులను అధ్యయనం చేసి భారతదేశంలో



కూడా అలాంటి వాతావరణం ఉండాలని అహర్నిశలు కృషి చేసిన కృషివళుడని కొనియాడారు. రాజ్యాంగంలో భారతదేశ ప్రజలకు హక్కులు, చట్టాలు, పరిపాలన విధానం, న్యాయ వ్యవస్థ, రిజర్వేషన్లు ప్రస్తావించకుండా ఉండి ఉంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల బతుకులు ఏమైపోయేవో నని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక కులానికో ఒక మతానుకో ఉపయోగపడే వ్యక్తి కాదని సమాజానికి మహా శక్తిని ఇచ్చిన ప్రపంచ మేధావి అని పేర్కొ న్నారు. అంగన్వాడి యూనియన్ నాయకురాలు నాగరత్న మాట్లాడుతూ.. ఇప్పటి కైనా బడుగు బలహీన వర్గాలు ప్రజలు డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ జయంతులు, వర్ధంతులు చేసి చేతులు దులుపుకునే దాని కన్నా ఆయన ఆలోచన విధానాలను ముందుకు కొనసాగించి చట్టాలు తెలుసుకొని హక్కులు సాధించుకోవ దానికి వివిధ రాజకీయ పార్టీల గొడుగుల కింద ఉండే బహుజన నాయకులు ముందుకొచ్చి రాజకీయ, కుల వివక్ష, అంటరానితనం, సంక్షేమ పథకా లు, రిజర్వేషన్లు అందక వెనుకబడిన వారిని భుజం తట్టి నడిపించాలన్నారు. అప్పుడే బాబా సాహెబ్ అంబేద్కర్‌కు ప్రజలు ఇచ్చే గొప్ప బహు మతి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద, అమానుల్లా, సూర శ్రీనివాసులు, నారాయణ శెట్టి, సాంబశివ, లక్ష్మమ్మ, మారక్క, శంకరప్ప పాల్గొన్నారు.

# నేడు టిడ్కో గృహాల గృహప్రవేశం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 14:**
శ్రీకాళహస్తి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన దిశగా కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన టిడ్కో గృహాలు బుధవారం లబ్ధిదారులకు ఇచ్చే విధంగా శ్రీకాళహస్తిలో పూర్తి కార్యాచరణ చేపట్టారు.శ్రీకాళహస్తి పలక సంఘం కమిషనర్ భవాని ప్రసాద్ , తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ సంయుక్తంగా టిడ్కో గృహాల సముదాయాలను పరిశీలించారు. పనులు పూర్తి అవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం లబ్ధిదారులకు అన్ని వసతులతో కూడిన గృహాలను అందజేసే విధంగా కార్యాచరణ చేపట్టారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో గృహాలను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో 1648 గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామని, దీనికి సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే పూర్తి చేశామని. అన్ని వసతులతో కూడిన గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామని సందర్భంగా తెలియజేశారు. శ్రీకాళహస్తి తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో టిడ్కో గృహ సముదాయాన్ని అసంపూర్తిగా నిలిపివేయడంతో లబ్ధిదారులకు గృహాలను అందజేయకుండా లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారని కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేసే విధంగా కార్యాచరణ చేపట్టిందని. శ్రీకాళహస్తి పట్టణంలోని శివనాధపురం వద్ద ఏర్పాటుచేసిన టిడ్కో గృహ సముదాయంలో 1648 గృహాలను లబ్ధిదారులకు స్థానిక



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అందజేసే విధంగా కార్యాచరణ చేపట్టామని వీటికి సంబంధించిన పనులు నేడు తాము పురపాలకసంఘం అధికారులతో కలిసి పరిశీలించామని. అన్ని వసతులతో కూడిన గృహాలను స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులు అందజేస్తున్నామని తెలియజేశారు . లబ్ధిదారులు మాట్లాడుతూ కలలు కంటున్న ఎన్నో ఎలాగా కలలు కంటున్న తమ సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తమకు టిడ్కో గృహ సముదాయం నందు తమకు సొంత ఇంటిని ఇవ్వడం చాలా సంతోషంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేశారు. తమ సాధకబాధకాలను అర్థం చేసుకొని తమకు సొంతింటిని ఇచ్చిన తెలుగుదేశం ప్రభుత్వానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143